రేషన్ కష్టాలు తీరేదెన్నడో



- జియ్యం కోసం గంటల తరబడి నిరీక్షణ
- సర్వర్ సమస్యతో పంపిణీలో తీవ్ర జాప్యం

ఎన్‌పీకుంట: చౌకధాన్యపు డిపోల ద్వారా కార్డుదారులకు అందిస్తున్న నిత్యావసర సరుకులు ఎప్పుడు ఇస్తారో.. ఎంత మందికి ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడి ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎండీయు ఆపరేటర్ల ద్వారా ఇంటింటికీ వాహనాలతో రేషన్ పంపిణీ విధానాన్ని అమలు చేసింది. దీనితో నడవలేని వారు, చౌక దుకాణానికి దూరంగా ఉన్నవారు, వృద్ధులు నిర్ధీత తేదీల్లో ఇంటివద్దనే నిత్యావసర సరుకులు పొందేవారు. 1వ తేదీ నుంచి 10వ తేదీ లోగా కార్డుదారులందరికీ రేషన్ సరుకులు ఇంటికి చేరేవి. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. రేషన్ సరుకుల కోసం కార్డుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

సరుకులు ఎప్పుడిస్తారో తెలియదు..

మండల వ్యాప్తంగా 34 రేషన్ షాపులు ఉన్నాయి. ఇందులో దాదాపు 9838 కార్డుదారులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో నిలిపివేసిన ఎండీయూ వాహనాలు



మండల కేంద్రంలోని ఓ రేషన్ షాపు వద్ద బియ్యం కోసం పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

గతంలో 14 పంచాయితీలకు 6 ఎండీయూ వాహనాలు ఉండేవి. అందులో అప్పట్లోనే ఒక వాహనం ప్రమాదవశాత్తు కాలిపోయిందని, మరో రెండు వాహనాలు నిర్వహణ చేయలేక వాటిని తహసీల్దార్ కార్యాలయంలో ఉంచారు. మిగిలిన మూడు వాహనాల ద్వారా పల్లెల్లో రేషన్ పంపిణీ చేస్తున్నారు. దీనితో ఏ గ్రామంలో ఎప్పుడు రేషన్ సరుకులు పంపిణీ చేస్తారో అంటూ కార్డుదారులు వేచిఉండాల్సి వస్తోంది. మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో చౌకధాన్యపు డిపోలు ఒకేసారి తెరిచి రేషన్ సరుకులను పంపిణీ చేయడం లేదు. ఒక ప్రాంతంలో ఒక దుకాణం తెరిచి మూడు రోజుల పాటు సరుకులు ఇస్తున్నారు. ఇలా మూడు రోజులకు ఒక చౌకదుకాణంలో సరుకులు ఇస్తుండటంతో ఎప్పుడు ఏ దుకాణంలో సరుకులు ఇస్తున్నారో తెలియక కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తెరిచి ఉన్న చౌకదుకాణానికి కార్డుదారులు పోటెత్తుతున్నారు.

వలస కార్మికులకు తప్పని అవస్థలు..

బతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పరిస్థితి మరి దారుణంగా మారింది. గతంలో 1వ తేదీన పింఛన్‌తో పాటు రేషన్ సరుకులు తీసుకొని తిరిగి తాము పనిచేసే చోటికి వెళ్లే వారు. కానీ ఇప్పుడు పింఛన్‌కు ఒక సారి, రేషన్ సరుకులు తీసుకోవడానికి ఒక సారి రావాల్సిన పరిస్థితి నెలకొంది. రేషన్ షాపులు నిర్వహిస్తున్న డీలర్లు రేషన్ పంపిణీ కోసం ఈపాస్ యంత్రంలో (ఆన్‌లైన్) సంబంధిత రెవెన్యూ ఉద్యోగి వేలిముద్ర తీసుకోవాలి. రేషన్ పంపిణీ జరుగుతున్న సమయంలో సర్వర్‌లో సాంకేతిక సమస్యల కారణంగా అకస్మాత్తుగా నిలిచిపోతే తిరిగి ఆ రెవెన్యూ ఉద్యోగి వేలిముద్ర వేసేంత వరకు ఈపాస్ యంత్రం పని చేయదు. దీనితో కార్డుదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం ఈ సమస్య అధికంగా ఉండటంతో కార్డుదారులు దుకాణాల వద్దే ఉండాల్సి వస్తోంది.

ఇబ్బందులు తప్పడం లేదు



రేషన్ సరుకులు తీసుకోవడం కోసం ప్రతి నెలా ఇబ్బందులు తప్పడం లేదు. అంతే కాక మా స్టోర్‌కు సరుకుల సరఫరా కూడా సరిగా చేయడం లేదు. రెండు నెలలుగా రేషన్ సరుకుల కోసం ఇబ్బంది పడుతున్నాం. చౌకదుకాణంలో కేవలం బియ్యం, చెక్కర మాత్రమే ఇస్తున్నారు. అది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.

–గంగాద్రి, ఎదురుదోన, ఎన్.పీ.కుంట మండలం

నేత్రదానంతో మరొకరికి చూపు



నేత్రదానం చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

ధర్మవరం: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పూజారి వెంకటరాముడు గురువారం మృతి చెందారు. వారి కుమారులు పూజారి జగదీష్, పూజారి గిరిధర్, అన్న పూజారి నారాయణ కుటుంబ సభ్యులు మృతుడి నేత్రాలను దానం చేశారు. యువర్స్ ఫౌండేషన్ సహకారంతో నేత్రదానానికి అంగీకరించిన మృతుని కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, డాక్టర్ బీవీ సుబ్బారావు, ఫాస్ట్ ప్రెసిడెంట్ వైకే శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ టెక్నీషియన్స్ రాఘవేంద్ర, భాస్కర్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నరాయపట్నంలో వనభోజనం

బత్తలపల్లి: చెన్నరాయపట్నం గ్రామంలో గురువారం గ్రామస్తులు వనభోజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ అనంతరం వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామాలో ప్రతి ఒక్కరూ చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ఇళ్లకు తాళాలు వేసి అందరూ గ్రామంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి రోజంతా అక్కడే గడిపారు. బావుల వద్ద పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అక్కడే వంటలు చేసుకుని విందు ఆరగించారు. అక్కడ బంధువులు, స్నేహితులతో కలిసి కాలక్షేపం చేశారు. ఆటలు, ఊయ్యాల ఊగుతూ కేరింతలు కొట్టారు. టెంకాయలు, చీనీ కాయలు విసురుతూ పందాలు ఆడారు. అనంతరం సాయంత్రం అందరూ గ్రామంలో ఏర్పాటు చేసిన తోరణం కింద ఇళ్లకు చేరుకున్నారు. గ్రామాల్లోని దేవులకు నారికేళాలను సమర్పించారు.

క్లుప్తంగా

బీసీ బాలుర వసతిగృహం తనిఖీ



వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న డీడీ నిర్మలాజ్యోతి

ఎన్‌పీకుంట: స్థానిక బీసీ బాలుర వసతిగృహాన్ని బీసీ వెల్ఫేర్ డీడీ నిర్మలాజ్యోతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో వంటగది, ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరుపట్టిక, రికార్డులను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులతో మాట్లాడి ఆరా తీశారు. నాలుగో తరగతి నుంచి 9వ తరగతి వరకు 32 మంది విద్యార్థులకు గాను 22 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో వార్డెన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు సురక్షితం



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

గాండ్లపెంట: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు సురక్షితమని మండల వైద్యాధికారి డాక్టర్ మహేశ్వరమారుతి పేర్కొన్నారు. గురువారం ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ యోజన కింద 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో హైరిస్క్ వారిని గుర్తించి కదిరి ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో గర్భిణులు మంచి నీటిని అధికంగా తీసుకోవాని, అత్యవసరమైతేనే బయటికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందుకుంటున్న బాబుబాలాజీ, రామలాలిత్య

ధర్మవరం అర్బన్: ధర్మవరంలోని శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువులు, 12 మంది శిష్యులకు గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లు అందించారు. గురువారంహైదరాబాద్‌లోని కోటిలోనున్న తెలంగాణ సారస్వత పరిషత్‌లో భారత్ ఆర్ట్స్ అకాడమీ 2023లో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో పేర్లు నమోదైన వారికి అందించారు. అనంతరం నాట్య గురువు బాబు బాలాజీని సన్మానించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లు అందుకున్న కళాకారుల్లో రామలాలిత్య, సర్వస్రి, ఉమాప్రియ, తనులత, హృషిత, వేదప్రజ్ఞ, లీలా మాధవి, జాహ్నవి, వైష్ణవి, అధిత్రి, ఉదయశ్రీ, సహస్రలు ఉన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి



బ్యాంక్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఎన్‌పీకుంట: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ సంజీవప్పరంగప్ప బేగర్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని నల్లగంగమ్మ గుడి సమీపంలో నిర్మించిన నూతన భవనంలో గురువారం బ్యాంకును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక బ్యాంకులో ఖాతాదారుల నుంచి రూ.44 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. బ్యాంకు ద్వారా రుణాలు పొందిన రైతులు, ఖాతాదారులు సకాలంలో వడ్డీ చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. రీజనల్ మేనేజర్ టి.రమేష్, బ్యాంక్ మేనేజర్ పిచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

21 న ప్రవేశ పరీక్ష

అమడగూరు: గాజుబండ సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈ నెల 20 వ తేదీ పరీక్ష ఉన్నట్లు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని అయితే, 20 న ఈస్టర్ సందర్భంగా 21 వ తేదీకి మార్పు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలి

కదిరి అర్బన్: ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలంటూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గురువారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టడంతోపాటు అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలన్నారు. మహిళా కండక్టర్లకు మూడు రోజుల సెలవు, గ్యారేజీ ఉద్యోగులకు సరైన పనిముట్లు కొనుగోలు చేయాలన్నారు. నాయకులు ఎన్‌వీ రమణ, గంగన్న, వహీదాబేగం, రామచంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట గురువారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జోనల్ నాయకులు ఏఎస్‌రావు, రీజనల్ నాయకులు జీవై నాగప్ప, దుర్గాప్రసాద్, డిపో చైర్మన్ హనుమాన్, అధ్యక్షుడు ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం, కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు ఆపాలన్నారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీ డ్యూటీలు కేటాయించాలన్నారు.



పుట్టపర్తి డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం డిపో ఎదుట ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. జోనల్ వైస్ ప్రెసిడెంట్ శంకర్, జిల్లా రీజనల్ అధ్యక్షులు శ్రీరాంనాయక్, కార్యదర్శి షబ్బీర్, ఉపాధ్యక్షురాలు తిరుపతమ్మ, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ కేశప్ప, డిపో చీఫ్ అడ్వైజర్ అప్పిరెడ్డి, ప్రెసిడెంట్ శివశంకర్,, ట్రెజరర్ శివారెడ్డి డిపో జాయింట్ సెక్రటరీ రంగనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరత్నం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పుట్టపర్తి అర్బన్: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శించారు. నిడిమామిడి గ్రామానికి చెందిన ఆదిరెడ్డి గారి నాగరాజుపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదై జైలుకు వెళ్లి వచ్చిన సంగతి తెలిసి ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే గ్రామంలో తీవ్ర అనారోగ్యానికి గురైన పాల గోవింద్‌ను పరామర్శించారు. ఆయన భార్య నాగరత్నమ్మకు ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామంలో ప్రమాదవశాత్తు గాయపడిన ఈడిగ జయమ్మను పరామర్శించారు. అనంతరం గాజులపల్లిలో గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత విజయ్‌కుమార్‌నాయక్ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అక్కడి నుంచి కత్తివారిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న బాబయ్య,కొట్లపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న బంట్రోతు రామాంజిని పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆంజనేయులు కుటుంబాని సంతాపం తెలియజేశారు. పెడపల్లిలో ఇటీవల ఆటో బోల్తాపడి మృతి చెందిన రాధ కుటుంబాన్ని, మంగళ చంద్రశేఖర్ కుటుంబాన్ని పెద్ద తండాలో పెద్ద నాయకుడు బాపూజీ కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ ఏవి రమణారెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, వైస్ ఎంపీపీ రంగన్న, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, కొట్లపల్లి సర్పంచ్ కుల్లాయిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, నాయకులు బాలు, నంజిరెడ్డి, చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపాల్ నాయక్, మోహన్‌నాయక్, ఆనంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెడపల్లిలో రాధ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


ఎఫ్ఎన్ఓ మృతి బాధాకరం

పుట్టపర్తి రూరల్: ఎఫ్ఎన్ఓ భారతి మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అన్నారు. బుక్కపట్నం పీహెచ్‌సీలో పని చేస్తున్న భారతి ఎనుములపల్లిలోని తన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అక్కడికి చేరుకుని భారతి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామంలో అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద ఉన్న జమ్ముల వెంకటరాముడును పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, అర్బన్ మాజీ కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు పైపల్లి కేశప్ప, నారాయణరెడ్డి, రామాంజనేయులలు, కవిత, నారాపరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, శ్రీరాములు, నాగేంద్ర, మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రో ధరలు ఉపసంహరించాలి

కదిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే ఉపసంహరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఖాళీ సిలిండర్లతో నిరసన తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ సామాన్యులు ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్యాస్,పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. నాయకులు జీఎల్.నరసింహులు,బాబ్జాన్, జగన్మోహన్, ముస్తక్, రామ్మోహన్, ఆంజనేయులు, నారాయణ, రఫి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్, ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గణేష్ కూడలి వద్ద సిలిండర్లను చేత నెత్తిన పెట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడం దారుణమన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కొత్తచెరువు మండల కార్యదర్శి ముత్యాలు, వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి సాకే వెంకటేష్, ఐద్వా నేతలు రమాదేవి, శ్రావణి, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



కదిరిలో నిరసన తెలియజేస్తున్న నాయకులు

తాడిమర్రి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలపై సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలియజేశారు. వీరభద్రయ్య గుడి నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు.నాయకులు పార్నపల్లి నారాయణ, మల్లప్పగారి మహేష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సీఐటీయూ నేతలు విజయలక్ష్మి, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా చేసి మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుక్కపట్నం మండల నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతల మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 10 నెలలు కావొస్తున్నా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదన్నారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే రోజుల్లో కూటమి నేతలు బయటకు వస్తే వారిని ప్రజలే నిలదీస్తారన్నారు.

కార్యకర్తలు మెచ్చేలా జగనన్న 2.0 పాలన

జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితే కార్యకర్తలు మెచ్చేలా పాలన ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట చెప్పారు. గత పాలనలో సంక్షేమ రాజ్య స్థాపనకు శ్రీకారం చుట్టారన్నారు. ఇక సీఎం అయితే కార్యకర్తలకు, ప్రజలకు సమన్యాయం చేస్తారన్నారు. ఇదే విషయాన్ని జగనన్న పలు సమావేశాల్లో చెప్పారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దరాంపురం కేశప్ప, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నేతలు కొత్తకోట కేశప్ప, కుండ్ల కిష్టప్ప, విజయారెడ్డి, వెంకటరెడ్డి, రామలింగారెడ్డి, సర్పంచులు రమణయ్య, గోవిందరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, బూత్ లెవల్ కన్వీనర్లు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాజీ ముఖ్యమంత్రితో మక్బూల్, నాయకులు, కౌన్సిలర్లు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కెవి.ప్రణీత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కౌన్సిలర్లు లింగాల కృపాకర్‌రెడ్డి, నూరుల్లా, మహమ్మద్, ఆవుల స్వామి, సాదిక్ బాషా, షబ్బీర్, రామ్‌ప్రసాద్, వలీ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు తిరిగి ఇవ్వలేదని వ్యక్తిపై దాడి

ధర్మవరం అర్బన్: తీసుకున్న డబ్బు ఇవ్వలేదనే కారణంతో వ్యక్తిపై దాడి చేసిన ఘటన గురువారం రాత్రి పట్టణంలోని కేశవనగర్‌లో జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. కేశవనగర్‌కు చెందిన సురేష్ ఆదినారాయణ వద్ద రూ.20 వేలు అప్పుగా తీసుకున్నాడు. గురువారం సాయంత్రం డబ్బు ఇవ్వాలని ఆదినారాయణ వెళ్లి సురేష్‌ను అడిగాడు. డబ్బులు ఇప్పుడే లేవంటూ సమాధానం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న ఆదినారాయణ కుమారుడు దిలీప్‌కుమార్, అతని స్నేహితుడు గోపిలు రాత్రి సురేష్ ఇంటి వద్దకు వెళ్లి మా నాన్న డబ్బు అడిగితే ఇవ్వకుండా ఎదురు చెబుతావా అంటూ దాడి చేసి గాయపరిచారు. రక్తగాయాలైన సురేష్‌ను స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ మోటర్ అపహరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటకు చెందిన బొమ్మన వెంకటరమణ తన కొత్త ఇంటి నిర్మాణం వద్ద ఉన్న విద్యుత్ మోటర్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

వ్యక్తిపై వేధింపుల కేసు నమోదు

ధర్మవరం అర్బన్: అనుమానంతో వేధిస్తున్న భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. సుందరయ్యనగర్‌కు చెందిన సురేష్ పెయింటింగ్ పని చేసేవాడు. అతడి భార్య రూప పానిపూరి పెట్టుకుని జీవిస్తున్నారు. భార్యపై అనుమానం పెట్టుకున్న సురేష్ నిత్యం హింసించేవాడు. వేధింపులు తాళలేక ఆమె గురువారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

పుట్టపర్తి: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, దీనిపై వారికి అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె బుక్కపట్నంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలతో ఆరోగ్యంపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ కౌసల్య సాయి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: గర్భవతులు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనిస్తారని సీడీపీఓ కవితాదేవి అన్నారు. చెన్నేకొత్తపల్లిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు గంగాభవాని, అరుణ, ప్రశాంతి, వాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షయపై ఇంటింటా సర్వే

ధర్మవరం రూరల్: ఏలుకుంట్ల గ్రామంలో గురువారం క్షయ వ్యాధి గురించి ఇంటింటా సర్వే చేపట్టారు. కార్యక్రమాన్ని డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ జీఎన్ ప్రశాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రెండు వారాలకు మించి దగ్గు , సాయంత్రం సమయంలో జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం , ఆకలి లేకపోవడం వంటి లక్షణాలన్నారు. ఇలాంటి వారిని గుర్తించి వారి నమూనాలను సేకరించి పరీక్ష కేంద్రానికి పంపాలని వైద్య సిబ్బందికి సూచించారు.

రేపు రాతిదూలం లాగుడు పోటీలు

తాడిమర్రి: తాడిమర్రిలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విజేతలకు వరుసగా రూ.రూ.70వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు బహుమతి ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఎక్కడ వృషభాలైన ఈ పోటీల్లో పాల్గొన వచ్చని పేర్కొన్నారు. ఆసక్తి వున్న రైతులు రూ.500 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఉదయం 7 గంటలకే పోటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440566943 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కేసు నమోదు

ధర్మవరం అర్బన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన షేక్ సల్మాభానును భర్త షేక్ దాదాపీర్, అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.